# అభయమిస్తూ.. ఆశీర్వదిస్తూ

- సిరిసిల్లలో కేటీఆర్ పర్యటన



కేటీఆర్‌ను హత్తుకొని భావోద్వేగానికి లోనవుతున్న ఉద్యమకారిణి అంజవ్వ

సిరిసిల్ల రూరల్, మే,11: బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆదివారం సిరిసిల్లలో బిజీబిజీగా గడిపారు. నియోజకవర్గవ్యాప్తంగా విస్తృతంగా పర్యటించారు. పలు శుభకార్యాలకు హాజరై ఆశీర్వదిస్తూనే.. పలువురు బాధితులకు అభయమిస్తూ ముందుకుసాగారు. రాళ్లపేట మాజీ సర్పంచ్ తీగల దుర్గయ్య కొడుకు వివాహం ఇటీవలే జరుగగా, వారి నివాసానికి వెళ్లి నూతన దంపతులను ఆశీర్వదించారు. మామిడి చెట్టు కొమ్మ తలపై పడి కరీంనగర్ దవాఖానలో చికిత్స పొందుతున్న తంగళ్లపల్లికి చెందిన బీఆర్ఎస్ కార్యకర్త జంగపల్లి భిక్షపతితో ఫోన్‌లో మాట్లాడి అధైర్యపడకు అండగా ఉంటామని ధైర్యం చెప్పారు. ఉపాధి నిమిత్తం సౌదీకి వెళ్లి రోడ్డు ప్రమాదంలో గాయపడి దవాఖానలో చికిత్స పొందుతున్న మండెపల్లికి చెందిన మహేశ్ కుటుంబసభ్యులను కలిశారు. మహేశ్‌తో వీడియో కాల్‌లో మాట్లాడారు. 'నాలుగు రోజులు ధైర్యంగా ఉండు. అన్నీ చూసుకుంటా. నిన్ను మండెపల్లికి తీసుకువస్తా'నని ధైర్యం చెప్పారు. వీర్నపల్లిలో తెలంగాణ ఉద్యమకారిణి అల్వాల అంజమ్మను ఆప్యాయంగా పలుకరించారు. 'అంజక్క.. బాగున్నవా.. ఆరోగ్యం ఎట్లుంది' అని యోగక్షేమాలు తెలుసుకున్నారు. ఇలా పలువురికి భరోసానిస్తూ, సమస్యలను వింటూ ముందుకుసాగారు.

# మీ వల్లే మా బాబు దక్కిండు సార్

- అల్మాస్‌పూర్‌లో కేటీఆర్‌కు ముక్క బాల్‌రాజు కృతజ్ఞతలు



కేటీఆర్‌కు కృతజ్ఞతలు తెలుపుతున్న ముక్క బాల్‌రాజు

ఎల్లారెడ్డిపేట, మే 11: 'సార్ మీ వల్లే మా బాబు మాకు దక్కిండు. గుండె సంబంధిత చికిత్సకు మీరందించిన సాయం మరువలేను' అంటూ ఎల్లారెడ్డిపేట మండలం అక్కపల్లికి చెందిన ముక్క బాల్‌రాజు ఆదివారం బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను కలిసి కృతజ్ఞతలు తెలిపాడు. బాల్‌రాజు-కల్పన దంపతులకు కొడుకు ఐదు నెలల క్రితం బాబు (భరత్‌కుమార్)జన్మించాడు. పుట్టుకపోతోనే గుండెకు రంధ్రం ఉందని, మందులతో తగ్గుతుందని వైద్యులు తెలిపారు. కానీ మూడు నెలలైనా తగ్గకపోగా, సమస్య పెద్దదై, శ్వాస ఇబ్బంది ఏర్పడింది. గత మార్చి 7న హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ దవాఖానకు తరలించారు. ఆపరేషన్ కోసం ₹8 లక్షలు అవుతుందని వైద్యులు చెప్పడంతో ఏం చేయాలో తెలియని పరిస్థితి ఏర్పడింది. దీంతో బాలుడి తల్లికి బంధువైన అల్మాస్‌పూర్‌కు చెందిన బీఆర్ఎస్ నాయకులకు తమ పరిస్థితిని తెలియజేయగా, వెంటనే వారు ఎమ్మెల్యే కేటీఆర్‌కు సమాచారం ఇచ్చారు. కేటీఆర్ స్పందించి బాలుడి ఆపరేషన్‌కు సాయం అందించే ఏర్పాటు చేశాడు. శస్త్ర చికిత్స విజయవంతంగా పూర్తికావడంతో కుటుంబ సభ్యులు ఇటీవలే అక్కపల్లికి చేరుకున్నారు. అయితే కేటీఆర్ ఆదివారం అల్మాస్‌పూర్‌లోని రేణుకాదేవీ ఆలయానికి వస్తున్నట్లు సమాచారం తెలియడంతో బాల్‌రాజు వచ్చి కేటీఆర్‌ను కలిశాడు. 'మీ వల్లే మా బాబు దక్కిండు సార్. మిమ్మల్ని ఎప్పటికీ మరిచిపోలేమంటూ' కృతజ్ఞతలు తెలిపాడు.

# షెడ్యూల్ ప్రకారమే పరీక్షలు




కమాన్‌చౌరస్తా, మే 11: శాతవాహన విశ్వవిద్యాలయం పరిధిలో డిగ్రీ రెండో, నాలుగో, ఆరో సెమిస్టర్ రెగ్యులర్, బ్యాక్‌లాగ్ పరీక్షలు షెడ్యూల్ ప్రకారం ఈ నెల 14 నుంచి యథావిధిగా ప్రారంభం అవుతాయని, విద్యార్థులు పరీక్షలకు సన్నద్ధం కావాలని విశ్వవిద్యాలయ పరీక్షల నియంత్రణ అధికారి డాక్టర్ డీ సురేశ్‌కుమార్ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పరీక్ష ఫీజులు చెల్లించిన విద్యార్థులకే పరీక్షలు నిర్వహిస్తున్నామని, ఫీజు చెల్లించని ప్రైవేట్ కళాశాల విద్యార్థులు ఈ నెల 12లోగా ఫీజులు చెల్లించాలని సూచించారు. త్వరలోనే విద్యార్థులకు హాల్ టికెట్లు జారీ చేస్తామని తెలిపారు.




కొత్తపల్లిలో నిర్మాణంలో ఉన్న మెడికల్ కళాశాల భవనం



# మెడికల్ కాలేజీపై నిర్లక్ష్యపు నీడ



## ఖమ్మంలో పూర్తి.. కరీంనగర్‌లో సుస్తీ

కరీంనగర్ ప్రభుత్వ మెడికల్ కాలేజీపై నిర్లక్ష్యం కొనసాగుతున్నది. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఏర్పాటు చేసిన ఈ కళాశాలలో ఇప్పటికే ద్వితీయ సంవత్సరం కూడా ప్రారంభమైనా.. బాలారిష్టాలు దాటడం లేదు. గడువు ప్రకారం ఇప్పటికే పూర్తి కావాల్సిన భవన నిర్మాణ పనులు నేటికీ పూర్తి కాలేదు. ఈ కళాశాలతోనే ఖమ్మంలో ప్రారంభమైన భవనం పూర్తి కాగా, ఇక్కడ మాత్రం నత్తకు నడకలు నేర్పుతున్నది. మరోవైపు కళాశాలకు దూరంగా వసతి గృహాలు ఉండడం, మెడికోల రాకపోకలకు ఒకే బస్సు ఉండడంతో ఇబ్బందిగా మారింది. ఇంకోవైపు బోధన సిబ్బంది కూడా లేక విద్యార్థులు నష్టపోవాల్సి వస్తున్నది. కళాశాలకు ప్రిన్సిపాల్ రాకపోవడంతో పరిపాలనా విభాగంలో పనిచేసే సిబ్బంది కూడా ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నా.. పట్టించుకునే దిక్కు కరువైంది.



కళాశాల తాత్కాలిక భవనం

- నత్తనడకన భవన నిర్మాణ పనులు
- కాలేజీకి దూరంగా హాస్టళ్లు
- ఒక్క బస్సుతో రాకపోకలకు మెడికోల ఇబ్బందులు
- ఇప్పటికీ భర్తీ కాని ఫ్యాకల్టీ పోస్టులు
- తరగతుల నిర్వహణలో తప్పని తిప్పలు
- రాష్ట్ర సర్కారు తీరుపై విమర్శలు

కరీంనగర్, మే 11 (నమస్తే తెలంగాణ)/విద్యానగర్ : రాష్ట్రంలోని అన్ని జిల్లా కేంద్రాల్లో ఏర్పాటు చేసినట్టే.. బీఆర్ఎస్ ప్రభుత్వం కరీంనగర్‌లోనూ ఒక మెడికల్ కళాశాలను ఏర్పాటు చేసింది. 2023 జూన్‌లో కళాశాల మంజూరు కాగా, సెప్టెంబర్‌లో 2023-24లో తరగతులను ప్రారంభించింది. కళాశాల ఏర్పాటుకు ₹138 కోట్లు కేటాయించింది. కరీంనగర్ శివారులోని కొత్తపల్లిలో విత్తనోత్పత్తి సంస్థకు సంబంధించిన 25 ఎకరాల్లో ఈ కళాశాల నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. భవనం పూర్తయ్యే వరకు ₹7 కోట్లతో విత్తనోత్పత్తి సంస్థకే చెందిన గోదాములను ఆధునీకరించి కళాశాల తాత్కాలిక భవనంగా మార్చగా, దీనిని తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ వర్చువల్‌గా ప్రారంభించారు. మొదటి సంవత్సరం వంద మంది విద్యార్థులకు ప్రవేశాలు కల్పించారు. గతేడాది రెండో బ్యాచ్‌లో కూడా వంద మందికి ప్రవేశాలు కల్పించారు. అయితే, ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఈ కళాశాలపై శీతకన్ను వేయడంతో రెండేళ్లుగా ఇంకా బాలారిష్టాలు దాటినట్లు కనిపించడం లేదు. కరీంనగర్‌తోనే ప్రారంభమైన ఖమ్మం మెడికల్ కళాశాల భవనం పూర్తయి అందులో తరగతులు ప్రారంభం కాగా, ఇక్కడ మాత్రం ఇప్పటికీ భవన నిర్మాణం కొనసాగుతూనే ఉన్నది. అగ్రిమెంట్ ప్రకారం ఇప్పటికే పూర్తి కావాల్సి ఉన్నా ఈ భవనానికి ఇప్పటికీ ఒక రూపం రాలేదు. పనులు ఇలాగే కొనసాగితే మరో రెండేళ్లయినా పూర్తయ్యే పరిస్థితి కనిపించడం లేదు.

### కళాశాలకు దూరంగా హాస్టళ్లు

కళాశాల పక్కా భవనాలు నిర్మాణంలో ఉండగా తాత్కాలికంగా ఏర్పాటు చేసిన కళాశాల భవనంలో హాస్టల్ సదుపాయం లేదు. దీంతో కరీంనగర్‌లోని దూర ప్రాంతాల్లో బాలురు, బాలికలకు వేర్వేరు చోట్ల వసతి సదుపాయం ఏర్పాటు చేశారు. బాలికలకు తీగలగుట్టపల్లిలోని ఓ ప్రైవేట్ భవనంలో రెండు బ్యాచ్‌లకు ఒకే చోట హాస్టల్‌ను ఏర్పాటు చేశారు. ఈ రెండు బ్యాచుల్లో 84 మంది మెడికోలు ఉన్నారు. ఇక ఒక బాలుర బ్యాచ్‌కు విద్యానగర్‌లో, మరో బ్యాచ్‌కు శ్రీపురం కాలనీలో హాస్టళ్లు ఏర్పాటు చేశారు. హాస్టల్లో వసతి సంగతి దేవుడెరుగు ఉన్నచోటి నుంచి కళాశాలకు రావాలంటే మెడికోలు నరకం చవి చూస్తున్నారు. ఇంత మంది వైద్య విద్యార్థులకు కేవలం 40 సీట్లు ఉన్న ఒక బస్సు మాత్రమే ఏర్పాటు చేశారు. ఉదయం 9 గంటలకు కళాశాలలో తరగతులు ప్రారంభమవుతున్నాయి. మొదటి సంవత్సరం విద్యార్థులు ఉదయం 7.30 గంటలకు తరగతులకు వెళ్లేందుకు సిద్ధమై ఉండాల్సి వస్తున్నది. ఉన్న చిన్న బస్సులో మూడు నాలుగు ట్రిప్పులు వేస్తే గానీ విద్యార్థులు కళాశాలకు చేరే పరిస్థితి కనిపించడం లేదు. ఇక రెండో సంవత్సరం విద్యార్థులు స్థానిక ప్రభుత్వ జనరల్ దవాఖానలో ప్రతి రోజు రెండు గంటలు ఓపీ చూడాలి. వీరికి ఉదయం 9 గంటలకే ఓపీ ప్రారంభమవుతుంది. ఒక్క బస్సుతో ఇటు మొదటి సంవత్సరం విద్యార్థులను కళాశాలకు, రెండో సంవత్సరం విద్యార్థులకు జనరల్ దవాఖానకు చేర్చాలంటే సమయం సరిపోవడం లేదు. దీంతో విద్యార్థులు కళాశాలకు వచ్చే సమయానికి అనుగుణంగా తరగతుల నిర్వహణ చేపట్టాల్సి వస్తున్నది. కనీసం మూడు బస్సులు ఉంటే గానీ విద్యార్థులు వేళకు కళాశాలకు చేరే పరిస్థితి కనిపించడం లేదు. కళాశాల ప్రారంభమైనపుడు ఒక ట్రిప్పు, వదిలేసిన తర్వాత మరో ట్రిప్పు చొప్పున కనీసం రెండు ఆర్టీసీ బస్సులైనా ఏర్పాటు చేయాలని వైద్య విద్యార్థులు కోరుతున్నారు. 40 సీట్ల బస్సులో 60 మందికి పైగా ఒకేసారి ప్రయాణించాల్సి వస్తోందని, ఏదైనా జరిగితే తమ పరిస్థితి ఏమిటని వారు వాపోతున్నారు.



మెడికల్ కళాశాలకు ఉన్న ఒక్కగానొక్క బస్సు

### ముఖ్యమైన పోస్టులన్నీ ఖాళీలే..

కళాశాలలో బోధనా సిబ్బంది పోస్టులు చాలా ఖాళీగా ఉన్నాయి. ఉన్నవారితోనే పాఠాలు బోధించాల్సి వస్తున్నది. ముఖ్యమైన పోస్టులు ఖాళీ ఉండడంతో విద్యార్థులు నష్టపోవాల్సి వస్తున్నది. 27 ప్రొఫెసర్ పోస్టులు ఉండగా పది మందే పని చేస్తున్నారు. అసోసియేట్ ప్రొఫెసర్ పోస్టులు 30 సాంక్షన్ ఉండగా 17 మంది మాత్రమే పని చేస్తున్నారు. 58 అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులకు 51 మంది పనిచేస్తున్నారు. 45 సీనియర్ రెసిడెన్స్ పోస్టులకు 30 మంది మాత్రమే ఉన్నారు. ఇక ట్యూటర్ పోస్టులు 25 ఉండగా 15 మంది మాత్రమే పని చేస్తున్నారు. అయితే, ఉన్న పోస్టుల్లో కొందరు హైదరాబాద్ నుంచి రాకపోకలు సాగిస్తున్నట్లు, వచ్చినప్పుడే మెడికోలకు పాఠాలు బోధిస్తున్నట్లు తెలుస్తున్నది. ఈ రకంగా తరగతుల నిర్వహణలోనూ తీవ్ర నిర్లక్ష్యం కనిపిస్తున్నది. మరో పక్క అడ్మినిస్ట్రేషన్ విభాగంలోనూ ఇదే పరిస్థితి ఉన్నది. ఈ విభాగంలో పని చేసే ఉద్యోగులు ఇలా వచ్చి అలా వెళ్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ముఖ్యంగా ప్రిన్సిపాల్ కూడా పూర్తి స్థాయిలో కళాశాలకు రాకపోవడంతో కళాశాలలో ఇటు అడ్మినిస్ట్రేషన్, అటు తరగతుల నిర్వహణ గందర గోళంగా మారినట్లు విమర్శలు వస్తున్నాయి.

### పట్టించుకోని ప్రభుత్వం

మెడికల్ కళాశాలల్లో ఉన్న సమస్యలను పరిష్కరించడంలో ప్రస్తుత ప్రభుత్వం పట్టింపు కనబర్చడం లేదనే విమర్శలు వస్తున్నాయి. పక్కా భవన నిర్మాణ పనులను వేగవంతం చేసేందుకు పర్యవేక్షణ కరువైంది. ఏ అధికారి కూడా ఈ భవన నిర్మాణాన్ని ఇంత వరకు పరిశీలించ లేదంటే ఎంత నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారో అర్థం చేసుకోవచ్చు. కళాశాలకు దూరంగా హాస్టళ్లు ఉండడం వల్ల రాకపోకలు సాగించేందుకు విద్యార్థులు నరకం చవి చూడాల్సి వస్తున్నది. విద్యార్థులు కోరుతున్నట్లు కనీసం సమయపాలన పాటిస్తూ రెండు ఆర్టీసీ బస్సులనైనా ఏర్పాటు చేయాల్సి ఉన్నా ఎవరూ పట్టించుకోవడం లేదు. ఒక యజ్ఞంలా సాగే మెడికల్ విద్యకు ఇలాంటి ఆటంకాలు, అసౌకర్యాలకు మెడికోలపై ప్రభావం చూపుతుందని పలువురు అభిప్రాయ పడుతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం పట్టించుకొని భవన నిర్మాణం త్వరగా పూర్తయ్యేలా చూడాలని, అప్పటి వరకు ఆర్టీసీ నుంచి రెండు బస్సులు ఎంగేజ్ చేయాలని మెడికోలు కోరుతున్నారు.




# ట్రినిటీ విద్యార్థుల విజయభేరి

ట్రినిటీ విద్యార్థులను అభినందిస్తున్న విద్యా సంస్థల వ్యవస్థాపక చైర్మన్ దాసరి మనోహర్‌రెడ్డి

కరీంనగర్ కమాన్ చౌరస్తా, మే 11 : ఎప్‌సెట్ ఫలితాల్లో ట్రినిటీ జూనియర్ కళాశాల విద్యార్థులు రాష్ట్ర స్థాయి అత్యుత్తమ ర్యాంకులు సాధించారని విద్యా సంస్థల వ్యవస్థాపక చైర్మన్ దాసరి మనోహర్‌రెడ్డి తెలిపారు. ఆదివారం కరీంనగర్‌లోని వావిలాలపల్లిలోగల కళాశాల ప్రాంగణంలో ఆయన విద్యార్థులను అభినందించి మాట్లాడారు. తమ విద్యా సంస్థల్లోని విద్యార్థులు 405, 430, 560, 697, 730, 760, 791, 859, 934,1104, 1166, 1546, 1619, 1795, 1950 ర్యాంకులతో పాటు మొత్తం 89 మందికి పైగా విద్యార్థులు 10 వేలలోపు ర్యాంకులు సాధించారని చెప్పారు. ట్రినిటీ జూనియర్ కళాశాలలు పోటీ పరీక్షల్లో ఏటా అత్యుత్తమ ర్యాంకులు సాధిస్తూ విద్యా రంగంలో తమ ప్రత్యేకతను చాటుతున్నాయని తెలిపారు. ఐఐటీ జేఈఈ మెయిన్స్, అడ్వాన్స్‌డ్, నీట్, ఎప్‌సెట్ పోటీ పరీక్షల బోధనలో అనుభవం, నైపుణ్యం కలిగిన అధ్యాపకుల శిక్షణ, అంకిత భావం కలిగి, నిరంతరం కృషి చేయడం ద్వారానే ఈ ర్యాంకులు సాధ్యమయ్యాయన్నారు. ఈ ఫలితాలు కేవలం కరీంనగర్ జిల్లా కేంద్రానికి చెందిన కళాశాలల్లోవి మాత్రమే అన్నారు. ఈ కార్యక్రమంలో ట్రినిటీ విద్యాసంస్థల చైర్మన్ దాసరి ప్రశాంత్ రెడ్డి విద్యార్థులను అభినందిస్తూ, ఈ విజయంపై సంతోషం వ్యక్తం చేశారు. ఇందుకు కృషి చేసిన అధ్యాపకులను అభినందించారు.




కరీంనగర్ వావిలాలపల్లిలోని అల్ఫోర్స్ టైనిటాట్స్ పాఠశాలలో విద్యార్థులను అభినందిస్తున్న చైర్మన్ నరేందర్‌రెడ్డి

# అల్ఫోర్స్ ప్రభంజనం

- ఎప్‌సెట్ -2025లో ఉత్తమ ర్యాంకులు సాధించిన విద్యార్థులు
- అభినందించిన చైర్మన్ వీ నరేందర్‌రెడ్డి

కరీంనగర్ కమాన్‌చౌరస్తా, మే 11 : ఎప్‌సెట్ -2025 ఇంజినీరింగ్, అగ్రికల్చర్, ఫార్మసీ ఫలితాల్లో అల్ఫోర్స్ విద్యార్థులు ప్రభంజనం సృష్టించారని విద్యాసంస్థల అధినేత డాక్టర్ వీ నరేందర్‌రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా కరీంనగర్‌లోని వావిలాలపల్లిలోగల టైనిటాట్స్ పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన అభినందన సభలో ఆయన మాట్లాడారు. కళాశాలకు చెందిన బీ వర్షిత్ 203, అదిబా ఫిర్దోజ్ 206, ఎం ప్రణీత్ 250, కే మనోజ్‌కుమార్ 286, బీ శ్రీనిత్య 296, జీ కౌషల్ ప్రియ 339, జీ రిషిత 438, జే అనూష 447, కే అర్చన 485, ఎండీ అబ్దుల్ జిషాన్ 551, సీహెచ్ శ్రీనిధి 567, కే వీరేంద్రప్రసాద్ 572, ఎం రోహిత్‌రెడ్డి 606, అబు ఉమేర్ 614, హాస్నమహవిష్ 639, పీ శ్రీనిత్యరెడ్డి 704, కే శ్రీరామ్‌చరణ్ 732, కే హాసిని 735, రాంసకోరిన్ 738, డీ సుమఙ్గయ 752, ఎల్ శరణ్య 762, జీ సింధు 763, బీ అభిజ్ఞ 801, జే వామిక 807, వీ అక్షయ్ 831, డీ హరిశంకర్ 838, బీ భువనకృతి 839, ఏ శశిప్రితమ్ 853, కే సాయిశ్రేయాన్‌రెడ్డి 908, వీ హృషికేశ్ 920, మహ్మద్ సఫ్రోజ్ 927, కే గాయత్రి 992, ఏ శ్రీనిజరెడ్డి 997 వ ర్యాంకు సాధించారన్నారు. వెయ్యిలోపు 33 మంది, 2000 వరకు 72 మంది, 3000లోపు 105 మంది, 5000లోపు 192 మంది విద్యార్థులు ర్యాంకులు సాధించి అల్ఫోర్ కీర్తి ప్రతిష్టలను దశదిశలా చాటారని చెప్పారు. తక్కువ మంది విద్యార్థులతో అత్యధిక అత్యద్భుత ర్యాంకులు సాధించడం అల్ఫోర్స్‌కు మాత్రమే సాధ్యమని ఈ ఫలితాలు తెలియజేశాయన్నారు. ఇదే క్రమంలో ఇటీవల ప్రకటించిన ఐఐటీ ఫలితాల్లో ప్రతిభ కనబర్చి 461 మంది అడ్వాన్స్‌డ్‌కు అర్హత సాధించారన్నారు. రానున్న అడ్వాన్స్‌డ్ ఫలితాల్లోనూ తమ కళాశాల విద్యార్థులు జాతీయ స్థాయి ర్యాంకులు సాధిస్తారని ధీమా వ్యక్తం చేశారు. అలాగే, నీట్ ఫలితాల్లోనూ ఉత్తమ ప్రతిభ కనబరుస్తారని చెప్పారు.

# శ్రీ చైతన్య ఉత్తమ ప్రతిభ



గోకులకొండ వైష్ణవి



మనోఘ్న

కమాన్‌చౌరస్తా, మే 11: ఎప్‌సెట్ ఫలితాల్లో శ్రీచైతన్య జూనియర్ కళాశాల విద్యార్థులు ఉత్తమ ప్రతిభచూపినట్లు విద్యాసంస్థల చైర్మన్ ముద్దసాని రమేశ్ రెడ్డి పేర్కొన్నారు. ఈ మేరకు ఆదివారం కరీంనగర్ జిల్లా కేంద్రంలోని కళాశాల ప్రాంగణంలో విద్యార్థులను ఆయన అభినందించారు. గోకులకొండ వైష్ణవి 810 ర్యాంకు, బీ మనోఘ్న 968, బీ సాత్విక్ 1142, పీ స్ఫూర్తిశ్రీ 1527, బీ శ్రావణి 1803, పీ బ్లెసీ సుసన్ 2106, పీ చందన 2165, పీ భరత్ రెడ్డి 2815, పీ అజితేష్ 3016, కే అనూహ్య 3503, వీ ప్రవీణ్ 3623, డీ రిషి 3996, జీ అర్చన 4171, ఆర్ శ్రీయాన్ 4246, వీ శివాణి 4570, బీ స్రవంతి 4957 ఇలా 16 మంది 5 వేలలోపు ర్యాంకులు సాధించారని, 10 వేల లోపు 51 మంది విద్యార్థులు సాధించడంపై సంతోషం వ్యక్తం చేశారు. ఈ విజయ సాధనకు ప్రత్యక్షంగా, పరోక్షంగా తోడ్పడిన అధ్యాపకులను అభినందించారు. ఇక్కడ శ్రీ చైతన్య కళాశాలల డైరెక్టర్ కర్ర సరేందర్ రెడ్డి, దీన్ జగన్ మోహన్ రెడ్డి, జూనియర్ కళాశాలల ప్రిన్సిపాల్స్ ఏజీఎం శ్రీనివాస్, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.



మెట్‌పల్లి వ్యవసాయ మార్కెట్ యార్డులో ధాన్యాన్ని తింటున్న ఆవులు



# ధాన్యానికి రక్షణేది?

- మెట్‌పల్లి వ్యవసాయ మార్కెట్‌లో వడ్లు పశువుల పాలు
- పట్టించుకోని సిబ్బంది

మారుతీనగర్, మే 11: ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియ అధ్వానంగా మారింది. అధికారుల నిర్లక్ష్యం రైతులకు శాపంగా మారుతున్నది. మెట్‌పల్లి పట్టణంలోని వ్యవసాయ మార్కెట్‌కు ధాన్యం తెచ్చి రోజులు గడుస్తున్నా కాంటా పెట్టకపోవడంతో పశువుల పాలవుతున్నది. ఓ వైపు అకాల వర్షాలతో ధాన్యం ఎక్కడికక్కడ తడిసిపోతున్న పరిస్థితి కనిపిస్తుండగా, మరోవైపు పర్యవేక్షణ, పట్టింపులేక ఆవులు, పందులకు ఆహారంగా మారుతున్నది. అధికారులు స్పందించి ధాన్యాన్ని త్వరితగతిన కొనాలని, మార్కెట్‌లోకి పశువులు రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని కోరుతున్నారు.

# మంచినీళ్ల కోసం వెళ్తూ..

- రోడ్డు ప్రమాదంలో హనుమాన్ మాలధారుడి మృతి
- స్కూటీపై వెళ్తుండగా వెనుక నుంచి బైక్ ఢీకొట్టడంతో ఘటన
- మరో ముగ్గురికి తీవ్ర గాయాలు
- రాజాక్కపల్లిలో విషాదం



దొరిశెట్టి నిక్షిత్ (ఫైల్)

వెల్గటూర్, మే 11: మంచినీళ్లు తెచ్చుకునేందుకు స్కూటీపై వాటర్‌ప్లాంట్‌కు వెళ్తూ రోడ్డు దాటుతుండగా వెనుక నుంచి బైక్ ఢీకొట్టిన ప్రమాదంలో హనుమాన్ మాలధారుడు ప్రాణాలు కోల్పోయాడు. స్థానికుల వివరాల ప్రకారం వెల్గటూర్ మండలం రాజాక్కపల్లి గ్రామానికి చెందిన దొరిశెట్టి నిక్షిత్ (18), పత్తిపాక కీర్తిచంద్ర (హనుమాన్ దీక్షాపరులు) ఆదివారం తమ గ్రామం నుంచి శాఖాపూర్‌లోని వాటర్ ప్లాంట్‌లో మంచినీళ్లు తెచ్చుకునేందుకు స్కూటీపై బయలుదేరారు. ప్లాంట్ రాగానే స్కూటీని స్లో చేసి రోడ్డు దాటుతున్న క్రమంలో ధర్మపురి నుంచి కరీంనగర్‌కు బైక్‌పై వెళ్తున్న ఇల్లంతకుంట వెల్దిపురానికి చెందిన వేములవాడ శ్రీనివాస్, బెజ్జంకి మండలం బేగంపేటకు చెందిన అన్నాజీ విక్రం వచ్చి బలంగా ఢీకొట్టారు. స్థానికులు, కుటుంబ సభ్యులు వచ్చి నలుగురు క్షతగాత్రులను కరీంనగర్ దవాఖానకు తరలిస్తుండగా, తలకు తీవ్ర గాయాలైన దొరిశెట్టి నిక్షిత్ మార్గమధ్యలో మృతి చెందాడు.